క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 23, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 13, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 50, గోకరకాయ 23, కీర 40, దోసకాయ 13, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 54, ఆలుగడ్డ 21, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

హుండీల ఆదాయం లెక్కింపు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను లెక్కించగా రూ.52,05,035 ఆదాయం వచ్చిందని ఆలయ అధికారులు తెలిపారు. వీటిలో అన్నదానం రూపంలో రూ.1,32, 689 వచ్చాయని, 145 యూఎస్ డాలర్స్, 5 సౌదీ రియాల్స్,4 సింగపూర్ డాలర్స్ ఉన్నాయన్నారు. లెక్కింపులో కార్య నిర్వహణ అధికారి నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

టీఎస్‌సెట్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్–2023 ప్రశాంతంగా ముగిసింది. ఈ నెల 28, 29, 30 తేదీలలో 29 సబ్జెక్టులకు 181 కేంద్రాలలో పరీక్ష జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలకు చెందిన 40838 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 31866 మంది హాజరయ్యారన్నారు.

టర్కీ సదస్సుకు ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులో ప్రసంగించేందుకు ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్‌కు ఆహ్వానం లభించింది.



ఓయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ వివిధ రంగాలలో 3–డీ ప్రింటింగ్ టెక్నాలజీస్ ఇట్స్ అప్లికేషన్ అనే అంశం పై ఉపన్యసించనున్నారు. ఓయూలో 3–డీ ప్రింటింగ్ పై ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు.


కాంగ్రెస్ టికెట్ తమిళులకు కేటాయించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న తమిళ సంఘం నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ వెన్నెలకు కేటాయించడంపై తమిళులు అసంతృప్తి వ్యక్తపరుస్తూ నిరసన తెలిపారు. సోమవారం కార్ఖానాలో తమిళ సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి స్థానికులకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే అభ్యర్థిని గెలిపించాలని తీర్మానించారు. తమిళ సంఘం నాయకులు మురళి మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో తమిళుల ఓట్లు అధికంగా ఉన్నాయని తమిళులకే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. తమిళుల సమస్యలు బీఆర్ఎస్ బీజేపీ నాయకులు పట్టించుకోవడం లేదని ఈ సారి కాంగ్రెస్ పార్టీ నుంచి తమిళులకు టికెట్ కేటాయించాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. స్థానిక తమిళులకు ఎవరికి టికెట్ కేటాయిస్తే గెలిపిస్తామన్నారు. కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థి విషయంలో పునరాలోచించాలన్నారు. పురణ్, కృష్ణవేణి, సంధ్య, జయంతి, అనిత, భవాని, మీనా, రాణి, ఊర్మిళ పాల్గొన్నారు.

9 మంది రౌడీషీటర్ల బైండోవర్



ఆంజనేయులు, ఓయూ ఇన్‌స్పెక్టర్

లాలాపేట: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు పోలీసు శాఖ తీసుకునే చర్యల్లో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది మంది రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. హబ్సిగూడ చౌరస్తా వద్ద పోలీసు నాకాబందీ ఏర్పాటు చేసి వాహనాల తనిఖీ చేస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలకు సహకరించాలన్నారు.

రూ. 2 కోట్లతో నిర్మించారు.. నిర్లక్ష్యంగా వదిలేశారు!



నిరుపయోగంగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి

- పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని తార్నాక ఫుట్ ఓవర్ బ్రిడ్జి
- లిఫ్ట్ వినియోగంలోకి రాకపోవడంతో వంతెనను వినియోగించని పాదచారులు
- ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న విద్యార్థులు
- దృష్టి సారించని అధికారులు

లాలాపేట: తార్నాక సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద తరచూ తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. నిర్మాణంలో తీవ్ర జాప్యం.. చాలా కాలం తర్వాత ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించినా అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. విద్యార్థులు, పాదచారులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సేవలు వినియోగించుకోవడం లేదు.



పని చేయాలని లిఫ్ట్

లిఫ్ట్‌లు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు అన్ని మెట్లు ఎక్కలేక ప్రమాదకరంగా రోడ్డును దాటుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల ముందు ఉన్న యూటర్న్ వద్దనే విద్యార్థులు రోడ్డు దాటుతున్నారు. దీంతో ఆ సమయంలో ఇటు తార్నాక చౌరస్తా, అటు లాలాపేట ఫ్లైఓవర్ వరకు ట్రాఫిక్ జాం ఏర్పడుతుంది.

ఆది నుంచి వివాదం..

2020లో రూ 2.6 కోట్ల వ్యయంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. పనులు ప్రారంభం అయినప్పటి నుంచి స్థానికంగా ఉన్న కొందరు వ్యాపారులు బ్రిడ్జి నిర్మాణాన్ని వ్యతిరేకించారు. దీనికి తోడుగా అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నాలుగు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పిన అధికారులు దాదాపు రెండేళ్ల వరకు పనులు కొనసాగించారు. ఎట్టకేలకు గత ఆరు నెలల క్రితం పూర్తవడంతో ప్రారంభించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలో లిఫ్ట్‌లు పనిచేయకపోవడంతో అన్ని మెట్లు ఎక్కలేక ఎవరూ దీనిపై నుంచి రాకపోకలు సాగించడం లేదు. మళ్లీ రోడ్డు దాటుతుండటంతో ట్రాఫిక్ జాంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని విద్యార్థులు, పాదచారులు వాపోతున్నారు.

నిర్వహణపై నిర్లక్ష్యం..

ఆది నుంచి ఈ బ్రిడ్జి ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందనడానికి లిఫ్ట్ సేవలను



సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద రోడ్డు దాటుతున్న విద్యార్థులు, పాదచారులు

ఇప్పటి వరకు పూర్తిగా అందుబాటులోకి తీసుకురాకపోవడమే నిదర్శనం. కోట్ల రూపాయాలు వెచ్చించి నిర్మాణం చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రజలకు ఉపయోగపడుతుందా లేదా అనే విషయంపై ఇటు వైపు అధికారులు కన్నెత్తి చూసిన పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందనే విషయాలను సైతం ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండానే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారని తార్నాక వాసులు ఆరోపిస్తున్నారు. ఇక తార్నాకలోని హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ప్రతిపాదించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఊసే లేదు.

రోడ్డు దాటాలంటే 500 మీటర్ల దూరం వెళ్లాల్సిందే

తార్నాక సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు రోడ్డు దాటకుండా రోడ్డు పొడవునా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేశారు. తార్నాక వైపు ఓయూ ఫారెన్ స్టూడెంట్స్ హాస్టల్ వద్ద యూటర్న్, అటు వైట్ హౌజ్ బస్టాప్ వద్ద యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో ఇటు వైపు నుంచి అటు వైపుకు వెళ్లాలంటే దాదాపుగా 500 మీటర్ల వరకు తిరిగి రావాల్సి వస్తుంది. దీంతో చేసేదేమి లేక విద్యార్థులు తార్నాక వైట్ హౌజ్ బస్టాప్ వద్ద ఉన్న యూటర్న్‌లోనే నిత్యం రోడ్డు దాటుతున్నారు. ఉన్న ట్రాఫిక్ సమస్య తీరకపోగా, రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ఐరన్ గ్రిల్స్‌తో రోడ్డు దాటాలంటే చాలా దూరం తిరిగి రావాల్సి వస్తుందన్నారు. ఇటీవల ఈ సమస్యపై ధర్నాలు సైతం చేసిన ఘటనలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి లిఫ్ట్‌లను వినియోగంలోకి తీసుకొస్తే సౌకర్యవంతంగా ఉంటుందని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంక్షేమ పథకాలే హ్యాట్రిక్‌కు దోహదం

తీగుళ్ల పద్మారావుగౌడ్

చిలకలగూడ: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించడంతో ప్రజలు నీరాజనాలు పడుతున్నారని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. మెట్టుగూడ డివిజన్‌లోని డీబీఆర్, ఎస్వీఎస్‌గల్లీ, మైలార్‌గడ్డ, పాండవబస్తీ, పార్థిబస్తీ, దూద్‌బావి, చింతబావి, శ్రీదేవి థియేటర్, పాత పోస్టాఫీసు తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి ఫలాలను నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి అందించామన్నారు. అన్నివర్గాలకు చెందిన ప్రజలు చూపిస్తున్న ఆదరాభిమానాలతో హ్యాట్రిక్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

- ఎన్నికల ప్రచారంలో భాగంగా మైలార్‌గడ్డలోని ప్రముఖ వ్యాపారవేత్త, స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ ఫౌండర్ ట్రస్టీ మింగు వెంకటసాయి కుమార్ (నైవేద్యం సాయి) ఇంటికి వెళ్లిన పద్మారావును ఆహ్వానించారు. సమోస తిని, చాయ్ తాగిన పద్మారావు ఎన్నికలకు సంబంధించి పలు అంశాలపై నైవేద్యం సాయితో ముచ్చటించారు. డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సునీత, హేమ, శైలజ, ప్రసన్నలక్ష్మి, కార్మిక విభాగ అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి, నాయకులు కిషోర్‌కుమార్, కిరణ్, రామేశ్వర్‌గౌడ్, త్రినేత్ర, కరాటే రాజు, నారాయణ, లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పద్మారావు గౌడ్‌ను గెలిపిస్తాం..

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడోసారి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తార్నాక వార్డు మెంబర్ వంజరి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం తార్నాక డివిజన్‌లో పద్మారావు తనయుడు త్రినేత్రగౌడ్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడారు. తార్నాక డివిజన్ లాలాపేటలో జాతీయ స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ వంటి భారీ ప్రాజెక్టులు చేపట్టారని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేర్చిన ఘనత పద్మారావు గౌడ్‌కే దక్కుతుందన్నారు. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ పద్మారావు గౌడ్‌ను విజయానికి దోహదపడుతాయన్నారు. నాగరాజు గౌడ్, మధుబాబు, వేణుగోపాల్‌రెడ్డి, దీపు, శివశంకర్, మహేశ్ పాల్గొన్నారు.



మైలార్‌గడ్డలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు



ప్రచారం పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల అభివృద్ధి

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

జంగ్ తెలంగాణ 2023

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే ముస్లింలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించామని బీఆర్ఎస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని ముస్లింలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. బేగంపేటలో ముస్లిం ఖబ్రస్తాన్‌ను నిర్మించాలని ఎన్నో సంవత్సరాల నుంచి డిమాండ్ చేస్తూ వస్తున్నా గత నాయకులు కేవలం ఓటు బ్యాంక్‌గానే ఉపయోగించుకున్నారే తప్ప వారి సమస్యలను పరిష్కరించలేదన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో రెండెకరాల స్థలం, నిర్మాణ పనుల కోసం రూ.3 కోట్లు మంజూరు చేయించి వారి దశాబ్దాల కలను సాకారం చేశారన్నారు. సనత్‌నగర్‌లోని అల్లావుద్దీన్ కోఠిలో ఎన్నో సంవత్సరాల నుంచి నివసిస్తున్నా వారికి గత పాలకులు పట్టాలు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే పట్టాలిచ్చి యాజమాన్యపు హక్కులు కల్పించామన్నారు. మసీదులు, ఖబ్రస్తాన్ల అభివృద్ధికి గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా అత్యధిక నిధులు ఖర్చు చేసినట్లు వివరించారు. పలువురు ముస్లిం ప్రముఖులు మాట్లాడుతూ.. గతంలో ఉన్న నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే తమ వద్దకు వచ్చేవారని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన తలసాని శ్రీనివాస్‌యాదవ్ లాంటి నాయకుడిని భారీ మెజార్టీతో గెలిపించుకోవడం తమ బాధ్యత అన్నారు. సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, ఖలీల్, నోమాన్, అఖిల్ అహ్మద్, ఫహీం, రజాక్, అబ్బాస్, ఆరీఫ్, కరీంలాలా, ఫాజిల్, యాసిన్, జావీద్, జమీర్, గౌస్, మాజిద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మళ్లీ నిలిచిపోయిన మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ పనులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్మించ తలపెట్టిన మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు మళ్లీ నిలిచిపోయాయి. దేవాదాయ శాఖ అధికారులు బిల్లులు చెల్లించని కారణంగా కాంట్రాక్టర్ పనులను నిలిపి వేసినట్లు సమాచారం. పది నెలల క్రితం ఇంజినీరింగ్ విభాగం అధికారులు భవనానికి సంబంధించిన డ్రాయింగ్స్‌ను సకాలంలో ఇవ్వకపోవడంతో ఫుటింగ్‌ల వరకు పనులు చేసి వదిలేశారు.దాదాపు నాలుగు నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోగా ఆలయ కార్య నిర్వహణ అధికారిగా పనిచేసిన అన్నపూర్ణ ఆర్కిటెక్టర్, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కాంట్రాక్టర్‌తో సమావేశం నిర్వహించి భవనాల డ్రాయింగ్స్‌ను కాంట్రాక్టర్‌కు ఇప్పించడంతో ఈ ఏడాది మార్చి 20న పనులు పునః ప్రారంమయ్యాయి. ఎక్కువ శాతం కార్మికులను పెట్టుకుని అగ్రిమెంట్ ప్రకారం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.పనులను వేగవంతం చేసినప్పటికి బిల్లులు చెల్లించడం లేదన్న సాకుతో అక్టోబర్ మొదటి వారం నుంచి మళ్లీ నిలిపివేశారు. దీంతో కాంప్లెక్స్ నిర్మాణం ఇప్పట్లో పూర్తి అయ్యేలా లేవు. భక్తుల రద్దీ కారణంగా ఆలయం పరిసరాల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని మల్టీలెవల్ పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను చేపట్టారు. కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు పార్కింగ్ చేసుకునే వీలుంటుంది.అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులకు అడుగడుగునా అడ్డంకులు తలెత్తుతుండటంతో కాంప్లెక్స్ ఇప్పట్లో అందుబాటులోకి వచ్చేలా కనిపించడం లేదని భక్తులు వాపోతున్నారు.

స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ గురుమూర్తి స్విమ్మింగ్ పూల్ అభివృద్ధితో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిమ్మర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అసోసియేషన్ అధ్యక్షులు సుందర్ రాజ్, నాగప్రసాద్, చంద్రశేఖర్ రెడ్డి, న్యాయవాది సుధీర్, లలిత్ భాయ్, సందీప్, మోహన్ ఓ ప్రకటన డిమాండ్ చేశారు. స్విమ్మింగ్ పూల్‌లో అనేక సమస్యలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సకాలంలో నీటిని మార్చక పోవడం, మరుగుదొడ్లు, బాత్రూమ్‌లలో దుర్వాసన వస్తోందన్నారు. నెలల తరబడి సమస్యలు వేధిస్తున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారని మండిపడ్డారు. స్విమ్మింగ్‌పూల్‌లో నెలకొన్న సమస్యలను సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంగా లేకుండా పోతుందన్నారు. ఏళ్ల తరబడి ప్రతి నెలా ఫీజులు చెల్లించినా స్విమ్మింగ్‌పూల్‌లో సమస్యలు వేధిస్తున్నాయన్నారు.

నగరంలో 'డైకిన్' సేవలు

లక్డీకాపూల్: నగరంలో డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా సంస్థ నగరంలో అతిపెద్ద డైకిన్ షోరూంను ప్రారంభించింది. సికింద్రాబాద్ ఎస్పీ రోడ్డులో ఏర్పాటు చేసిన షోరూమ్‌ను ఆ సంస్థ చైర్మన్, ఎండీ కన్వల్జీత్ జావా ప్రారంభించారు. శ్రీ కంఫర్ట్ ఎయిర్ ప్రొడక్ట్స్, సర్వీసెస్ డైకిన్ ఉత్పత్తులు, సేవలను ఒకే పైకప్పు కిందకి తీసుకువచ్చిందన్నారు. ఇక్కడ స్ప్లిట్ ఏసీలు, డక్టబుల్ ఏసీలు, వాణిజ్య స్థలాల కోసం వీఆర్వీలు, క్యాసెట్ ఏసీలు, డీహ్యూమిడిఫైయర్లు, చిల్లర్స్, ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు, రిఫ్రిజిరేషన్, కోల్డ్ స్టోరేజ్ పరికరాలు, డైకిన్ అడ్వాన్స్ టెక్నాలజీ ఎయిర్ కండిషనింగ్ సొల్యూషన్‌లను ప్రదర్శిస్తుందన్నారు. షోరూమ్ రిటైల్ కస్టమర్లకు అవసరమైన హై ఎండ్ కూలింగ్ సిస్టమ్‌లను అందించనున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీ కంఫర్ట్స్ సీఈవో కళ్యాణరామన్, ఎస్. కుటుంబ రావు పాల్గొన్నారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి



పీహెచ్‌డీ పూర్తి చేసిన సభ్యులను సత్కరిస్తున్న సంఘం నాయకులు

బౌద్ధనగర్: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని వక్తలు పేర్కొన్నారు. బౌద్ధనగర్ డివిజన్ పరిధిలోని గంగపుత్ర స్థానిక సంఘం, తెలంగాణ లెక్చరర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి పుల్లయ్య ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా పొందిన డాక్టర్లు దేశబోయిన రఘు, అక్కపల్లి ఉదయ్ కిరణ్, కూర మల్లికార్జున్‌లకు వారాసిగూడలోని గంగపుత్ర సొసైటీ భవనంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ.. గంగపుత్రులు కలిసి కట్టుగా ఉంటూ తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సంఘాలు అన్ని ఒకే వేదికపైకి రావాలన్నారు. అన్ని పార్టీలు గంగపుత్రులను ఓటర్లుగానే చూస్తున్నారని, రాజకీయంగా కూడా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టరేట్ పొందిన వారికి మంగళవారం జరిగే ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా అవార్డు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్వకొంద సత్యనారాయణ, కంటి హరినాథ్, కైరంకొండ యాదగిరి, రాజ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, మల్లేష్, ఎర్రబోయిన మల్లేష్, శ్యామ్ పాల్గొన్నారు.

గజ్జెలకు కంటోన్మెంట్ పగ్గాలు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేశ్‌ను నియమించారు. ఈ పాటికే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతుండగా, గజ్జెలకు అదనపు బాధ్యతలు ఇస్తూ రెండు రోజుల క్రితం అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. అయితే.. స్థానికంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన ఇప్పటికీ పార్టీ అభ్యర్థి లాస్య నందితతో భేటీ కాలేదని తెలుస్తోంది.

అసంతృప్తి తొలగించేందుకేనా..?

2014లో రాష్ట్రం ఏర్పడే నాటికి కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా గజ్జెల కొనసాగారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సాయన్న చేతిలో ఓటమిపాలయ్యారు. 2015లో సాయన్న టీఆర్ఎస్ గూటికి చేరడంతో నాటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరిలో మరణించే దాకా ఆయనే ఇన్‌చార్జ్‌గా కొనసాగారు. అనంతరం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డికి కంటోన్మెంట్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ఆయన మల్కాజ్‌గిరి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుండటంతో నియోజకవర్గ పరిధిలోనే నివాసముండే మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించారు. సనత్‌నగర్ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్న ఆయన కేవలం రెండుసార్లు మాత్రమే కంటోన్మెంట్‌కు సంబంధించిన సమావేశాలకు హాజరయ్యారు. ఇదిలా ఉండగా గజ్జెల నాగేశ్ పది రోజుల క్రితం బొల్లారంలో పాదయాత్రలో పాల్గొని, ఆ తర్వాత ప్రచారానికి దూరంగా ఉంటూ వచ్చారు. తనకు తగిన ప్రాధాన్యం లేనందునే ప్రచారానికి వెళ్లడం లేదని ఆయన పార్టీ పెద్దలకు చెప్పినట్లు సమాచారం. దీనికి తోడు గజ్జెల నాగేశ్ బీజేపీలోకి చేరబోతున్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో అధిష్ఠానం ఆయనకు ఎన్నికల ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు ప్రచారం సాగుతోంది. రెండు రోజుల క్రితమే ఆయన నియామకం జరిగినా, అభ్యర్థిని కలకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రూపు తగాదాల నేపథ్యంలోనే ఆయన లాస్య నందితకు దూరంగా ఉంటున్నారా? లేక ఇంకేమైనా కారణాలు ఉన్నాయో తెలియరావడం లేదు. అయితే తనను పార్టీ అధిష్ఠానం ఇన్‌చార్జ్‌గా నియమించిందని, త్వరలోనే పూర్తిస్థాయిలో విధుల్లో నిమగ్నం అవుతానని గజ్జెల చెబుతున్నారు. ఇప్పటికే గ్రూపు తగాదాలతో సతమతం అవుతున్న పార్టీలో గజ్జెల రాక ఏ పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే.



ఆధార్ కేంద్రం లేక అవస్థలు

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలో ఆధార్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అప్పుడే పుట్టిన శిశువు నుంచి పండు ముదుసలి వరకు అందరికి ఆధార్ కార్డే ఆధారమైంది. జనన, మరణ, కులం, ఆదాయం ధృవీకరణ పత్రాలకు ఇలా అన్నింటికి అధార్ కార్డు తప్పనిసరి చేశారు. ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. సెల్ నెంబర్, చిరునామా, పేరు మార్పు తదితర అంశాలపై సవరణకు నిరంతరం ప్రజలు ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే.. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్‌లలో ఎక్కడా అధార్ కేంద్రం లేకపోవడంతో ఈ ప్రాంతాల ప్రజలు అటు నాచారం, ఇటు అడ్డగుట్ట, మల్కాజిగిరి ప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో పాటుగా ఇటీవల రేషన్ కార్డులకు కేవైసీ అప్‌డేట్ చేసుకునేందుకు అధార్ కేంద్రం అందుబాటులో కుటుంబ సభ్యులంతా రోజుల తరబడి ఆధార్ కేంద్రాలున్నా ప్రాంతాలకు బారులుదీరుతున్నారు. ఇంత కాలం ఆధార్ కేంద్రం ఏర్పాటుపై అధికారులు, ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తార్నాక డివిజన్ పరిధిలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



కృష్ణారావును గెలిపించుకుందాం

సనత్‌నగర్: నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం తపించే కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి బేగంపేట ప్రకాష్‌నగర్ ప్రాంతంలో ఇంటింటి పాదయాత్ర చేసి కారు గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలు చేస్తున్నారన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బేగంపేట డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న ధనియాలగుట్ట శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎప్పుడు ఏ సమస్య తన దృష్టికి తీసుకువచ్చినా నిధులు మంజూరు చేయించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని అలాంటి నాయకుడిని మరోసారి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు.



కరపత్రం అందజేస్తున్న మహేశ్వరిశ్రీహరి

సమస్యలు విస్మరించిన బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: ప్రజా సమస్యలను విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నో పోరాటాలతో ఏర్పడిన అడ్డగుట్టలో నేటికీ కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అడ్డగుట్టలోని ఏ,బీ,సీ,డీ సెక్షన్లలో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని అనేకమార్లు సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా నాయకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని విమర్శించారు. కేవలం ఎన్నికల ముందు మాత్రమే పాదయాత్రలు, పర్యటనలు చేస్తూ ఉత్తుత్తి హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కొమరెల్లి బాబు, పాకాల యాదగిరి, శంకర్, ఖాసిం, రామస్వామి, బాలరాజ్, సాయిలు, రామ్‌చందర్, యాదగిరి, రాములు, ఎల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.